క్లుప్తంగా

నేటి నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

మర్రిగూడ : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సోమవారం నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్ ఎస్.శివస్వరూపరాణి తెలిపారు. ఆదివారం పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను ఆమె పర్యవేక్షించారు. పరీక్షలు రాసే విద్యార్థులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


ఇరగదిండ్ల గణేశ్, అధ్యక్షుడు

చిట్యాల : శ్రీ కనకదుర్గా ట్రాక్టర్ ఓనర్స్ అసోసియేషన్ పట్టణ నూతన కార్యవర్గాన్ని ఆదివారం జరిగిన అసోసియేషన్ సమావేశంలో ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడిగా జిట్ట బొందయ్య, అధ్యక్షుడిగా ఇరగదిండ్ల గణేశ్, ప్రధాన కార్యదర్శిగా సాగర్ల పవన్, సహాయ కార్యదర్శిగా ఆగు లింగస్వామి, సీహెచ్.మల్లేష్, ఉపాధ్యక్షులుగా జిట్ట వెంకన్న, ఆలకుంట్ల రాజు, కోశాధికారిగా కూరెళ్ళ రవితో పాటు మరికొందరు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

నూతన కమిటీ ఎన్నిక

కనగల్ : మండల పరిధిలోని పర్వతగిరి గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామశాఖ అధ్యక్షుడిగా నల్లబోతు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా చనగాని సైదులు, కార్యదర్శిగా నీలకంఠం దుర్గయ్య, కోశాధికారులుగా జగన్, నకిరేకంటి యాదగిరి, యూత్ అధ్యక్షుడిగా పన్నాల శ్రీశైలం, ఉపాధ్యక్షుడిగా తోలుగల్ల నాగరాజులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో చనగాని రమేష్, కదిరె నాగరాజు పాల్గొన్నారు.

నకిరేకల్‌లో నేడు 2కే రన్

నకిరేకల్ : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సోమవారం ఉదయం 6 గంటలకు నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నకిరేకల్ బైపాస్ రోడ్డులో 2కే రన్ నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ శంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నకిరేకల్ నియోజకవర్గ ప్రజలు, రన్నర్స్ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

విద్యార్థులకు సన్మానం


సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం ప్రతినిధులు

చిట్యాల : పదో తరగతి, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ముదిరాజ్ విద్యార్థులకు ఆదివారం పట్టణంలో పాండవ ముదిరాజ్(మత్స్య కార్మిక) సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి, నగదు ప్రోత్సాహకం అందజేశారు. సన్మానం పొందినవారిలో ఇంటర్ విద్యార్థులు దుడ్డు శ్రేయ, ఈదు జ్యోత్స్న, పదో తరగతి విద్యార్థులు జోగు యశ్వంత్, గొడుగు లక్ష్మీభవాని, మేఘవర్షిణిలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గొడుగు యాదగిరి, ఉపాధ్యక్షుడు పల్లెమోని చెన్నయ్య, ప్రధానకార్యదర్శి రేపాక వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శి పల్లెమోని నాగేందర్ పాల్గొన్నారు.

నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం

మర్రిగూడ : వేసవి సెలవులు ముగియడంతో సోమవారం నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయని ఎంఈఓ గురువారావు ఆదివారం తెలిపారు. మర్రిగూడ మండలంలో ప్రాథమిక పాఠశాలలు 28, ప్రాథమికోన్నత పాఠశాలలు 6, జిల్లా పరిషత్ 8, కస్తూరిబా-1, ఆదర్శ పాఠశాల-1 మొత్తం 44 ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమవుతున్నట్లు పేర్కొన్నారు.

సీపీఎం నాయకుడు మృతి

నల్లగొండ : మున్సిపాలిటీలోని మర్రిగూడకు చెందిన సీపీఎం నాయకుడు చిలుముల లింగయ్య మృతిచెందారు. ఆదివారం లింగయ్య మృతదేహాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి సందర్శించి ఎర్రజెండా కప్పి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు నాగార్జున సయ్యద్ హాశం, పట్టణ కార్యదర్శి ఎండీ సలీం నాయకులు మందడి ఎల్లారెడ్డి, మాజీ ఎంపీపీ బొజ్జ మారమ్మ, బొజ్జ వెంకన్న సీఐటీయూ నాయకులు కత్తుల యాదయ్య, బీపంగి రాములు, యాదయ్య, సహదేవులు, సుధాకర్ పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల ఆత్మీయ సమ్మేళనం

మునుగోడు : గూడపూర్ గ్రామానికి చెందిన నన్నూరి బుచ్చిరెడ్డి, వీరమ్మ కుటుంబ సభ్యులు ఆదివారం మునుగోడులోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. దాదాపు 300 మందికిపైగా ఉన్న కుటుంబ సభ్యులు ఒకేచోట కలుసుకుని తమ కుటుంబ పెద్దలను సత్కరించుకున్నారు.


సమ్మేళనంలో పాల్గొన్న కుటుంబ సభ్యులు

కరెంట్ లేక రైతుల ఇక్కట్లు

- నిమ్మతోట మధ్యలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్
- పంట నష్టం జరుగుతుండడంతో ట్రాన్స్‌ఫార్మర్‌కు తాళం వేసిన రైతు

శాలిగౌరారం : ఒక రైతు సమస్య కొంతమంది రైతులకు సాగునీటి సమస్యగా, పశువులకు తాగునీటికి ఇబ్బందిగా మారింది. మండలంలోని బైరవునిబండ గ్రామంలో 26 సంవత్సరాల క్రితం రాచకొండ మాణిక్యమ్మ అనే రైతు భూమిలో ఎస్ఎస్-7 నంబర్ గల 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ అధికారులు ఏర్పాటు చేశారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో ప్రస్తుతం ఏడుగురు రైతులకు సంబంధించి 15 విద్యుత్ మోటార్లు ఉన్నాయి. ఆయా మోటార్ల ద్వారా రైతులు వరి, నిమ్మ, పత్తి పంటలను సాగుచేస్తున్నారు. ఇదే ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో రాచకొండ మాణిక్యమ్మ అనే రైతుకు సంబంధించిన విద్యుత్ మోటారు కూడా ఉంది.

నిమ్మతోట దగ్ధమవుతుండడంతో..

రైతు మాణిక్యమ్మ నిమ్మతోట సాగుచేసింది. రెండు సంవత్సరాలుగా విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరగడం వల్ల నిమ్మతోటలోని చెట్లు దగ్ధమవుతున్నాయి. దీంతో నిమ్మతోట మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను


నిమ్మతోటలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

మరోచోటుకు మార్చాలని కోరుతూ అధికారులకు రైతులతో కలిసి విన్నవించారు. ట్రాన్స్‌ఫార్మర్ మార్చినట్లయితే దానికయ్యే ఖర్చులను విద్యుత్‌శాఖకు చెల్లించాలని అధికారులు చెప్పడంతో మిగిలిన రైతులు తమకు సంబంధం లేదని తప్పుకున్నారు.


విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏబీ స్విచ్‌కు వేసిన తాళం

దీంతో రైతు మాణిక్యమ్మ కుటుంబీకులు 25 రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ ఏబీ స్విచ్‌కు తాళం వేసి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో మిగిలిన రైతులు విద్యుత్ ఏఈ దృష్టికి సమస్యను తీసుకుపోయారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు వేసిన తాళాన్ని తొలగించాలని రైతు కుటుంబీకులకు ఏఈ సూచించారు. అయినప్పటికీ వారు తాళాన్ని తొలగించకపోవడంతో సంబంధిత రైతుపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు తాళం వేయడంతో పశువులకు తాగునీరులేక ఇబ్బందులు పడుతున్నాయి. వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో నారుమడులు సిద్ధం చేసుకునేందుకు వీలులేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు.

పంట నష్టాన్ని తట్టుకోలేక ట్రాన్స్‌ఫార్మర్‌కు తాళం వేశాం



నిమ్మతోట కలిగిన మా సొంత భూమి మధ్యలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. షార్ట్‌సర్క్యూట్ జరుగుతుండడం వల్ల తోటలోని నిమ్మచెట్లు దగ్ధమవుతున్నాయి. పంట నష్టాన్ని తట్టుకోలేక ట్రాన్స్‌ఫార్మర్‌కు తాళం వేశాం.
–రాచకొండ మాణిక్యమ్మ, రైతు, బైరవునిబండ

పోలీసులకు ఫిర్యాదు చేశాం

ట్రాన్స్‌ఫార్మర్‌కు తాళం వేసి విద్యుత్ సరఫరాను అడ్డుకోవడం సరైందికాదు. తాళం తొలగించాలని సూచించినా రైతు పట్టించుకోకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాం. ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలంటే అందుకు సంబంధించిన చార్జీలు విద్యుత్ శాఖకు చెల్లించవలసిందే.
–శ్రీధర్, ఎస్పీడీసీఎల్ ఏఈ, శాలిగౌరారం

గ్రామాల సమగ్రాభివృద్ధే ధ్యేయం

కట్టంగూర్ : గ్రామాల సమగ్రాభివృద్ధే బీఆర్ఎస్ ప్రభుత్వ ధ్యేయమని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలంలోని మల్లారం గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనానికి, ఎస్‌డీఎఫ్ నిధులు రూ.30 లక్షలతో నిర్మించే సీసీ రోడ్ల నిర్మాణానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడే సమయంలో అదే గ్రామానికి చెందిన ఓ రైతు కలుగజేసుకుని కేసీఆర్ నియంతలా వ్యవహరిస్తున్నారని అన్నారు. మరో మహిళ మాట్లాడుతూ ఇప్పటివరకు రుణమాఫీ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. తమ గ్రామానికి ఏ నిధులు ఇవ్వడంలేదని నిలదీశారు. దీంతో సమావేశంలో మాట్లాడకుండానే ఎమ్మెల్యే వెళ్లిపోయారు. అనంతరం మండలంలోని పందెనపల్లి గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు నకిరేకల్‌లో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య, జెడ్పీటీసీ తరాల బలరాములు, పీఏసీఎస్ చైర్మన్ నూక సైదులు, సర్పంచ్ దాసరి సంజయ్, ఎంపీటీసీ వల్లపు నాగలక్ష్మి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోగుల నర్సింహ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఏడుకొండలు, ఉప


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి

సర్పంచ్ గాదగోని సుజాతమురళి, పెద్ది బాలనర్సింహ, అంతటి గోపాల్ తదితరులు ఉన్నారు.

మున్సిపాలిటీని మోడల్‌గా తీర్చిదిద్దుతా

నకిరేకల్ : నకిరేకల్ మున్సిపాలిటీని మోడల్‌గా తీర్చిదిద్దుతానని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్ పట్టణంలోని 18వ వార్డులో మార్నింగ్ వాక్‌లో భాగంగా ఆదివారం ఆయన పర్యటించారు. వార్డులోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు పార్టీలకతీతంగా రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఆయన వెంట బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు యల్లపు రెడ్డి సైదిరెడ్డి, వార్డు కౌన్సిలర్ పల్లె విజయ్ తదితరులు ఉన్నారు.

బస్‌షెల్టర్ కూల్చివేతకు యత్నం


చెర్వుఅన్నారం స్టేజీ వద్ద ధ్వంసమైన బస్‌షెల్టర్


ధర్నా చేస్తున్న అఖిలపక్ష నాయకులు

కట్టంగూర్ : మండలంలోని అయిటిపాముల గ్రామ శివారులో జాతీయ రహదారి పక్కనే ఉన్న చెర్వుఅన్నారం స్టేజీ వద్ద ఉన్న బస్ షెల్టర్‌ను ఆదివారం అయిటిపాముల గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కూల్చివేతకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న నల్లగొండ మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి అఖిలపక్ష నాయకులతో కలిసి స్టేజీ వద్ద ధర్నా చేపట్టారు. జెడ్పీటీసీ తరాల బలరాములు ధర్నాకు మద్దతు తెలిపి బస్ షెల్టర్ కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు కూల్చివేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కట్టంగూర్ పోలీసు స్టేషన్‌లో నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కక్కిరేణి రామస్వామి, గుండగోని రాములు, చిలుముల రామస్వామి, ఇటికాల సురేందర్, కృష్ణయ్య, రాంరెడ్డి, సుధాకార్, శ్రీను పాల్గొన్నారు.

ఎన్నికల సందడి మొదలైనట్టేనా !


కొంపల్లి గ్రామంలో బీజేపీ నేత రాజగోపాల్ రెడ్డి వాల్‌రైటింగ్



బీఆర్ఎస్ పార్టీ నుంచి నారబోయిన రవి ముదిరాజ్ వాల్‌రైటింగ్

మునుగోడు : అసెంబ్లీ ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో ఎమ్మెల్యే బరిలో నిలవాలనుకుంటున్న ఆశావహులు ఊరూరా గోడలపై జోరుగా తమ చిత్రలతో కూడిన బొమ్మలను వేస్తున్నారు. ప్రధాన రోడ్ల వెంట ఉన్న ఇళ్లు, ఇతర వ్యాపార సముదాయాల గోడలపై తమ చిత్రపటాలతోపాటు పేర్లు, పార్టీ గుర్తులు రాయించుకుంటున్నారు. దీంతో అప్పుడే ఎన్నికల సందడి నెలకొందా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, నారబోయిన రవి ముదిరాజ్ గోడలపై రాయిస్తున్నారు. ఇక కాంగ్రెస్ పార్టీ నుంచి ఇద్దరు నేతలు చెలమల్ల కృష్ణారెడ్డి, పాల్వాయి స్రవంతి రెడ్డి తమ పార్టీ గుర్తులు, రాష్ట్ర నేతలతోపాటు తమ చిత్రాలను గోడలపై రాయించుకుంటున్నారు. బీజేపీ తప్పా ఇతర పార్టీల్లో ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్న వారి సంఖ్య పెరిగిందని చర్చ జరుగుతోంది. చివరికి ఎవరికి అవకాశం వస్తుందో అని చర్చ నియోజకవర్గ ప్రజల్లో మొదలైంది.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : వివిధ కారణాలతో ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన 21 మందికి మంజూరైన రూ.8,62,500 విలువ గల సీఎంఆర్ చెక్కులను శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆదివారం నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో కనగల్ జెడ్పీటీసీ చిట్ల వెంకటేశం, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కంచరకుంట్ల గోపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, ఐతగోని స్వామిగౌడ్, దుబ్బ అశోక్‌సుందర్, హరికృష్ణ, మందడి నర్సిరెడ్డి, యాదగిరి పాల్గొన్నారు.

మునుగోడు నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

చండూరు : మునుగోడు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి అన్నారు. చండూరు మున్సిపల్ పరిధిలో సీడీపీ నిధులు రూ.10 లక్షలతో కిరాణం అసోసియేషన్ బిల్డింగ్, రూ.10 లక్షలతో ఆర్యవైశ్య కమ్యూనిటీ హాల్, రూ.5 లక్షలతో నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌లకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉప ఎన్నికలో ఇచ్చిన హామీలన్నీ అమలుచేస్తున్నామన్నారు. 2014వ సంవత్సరానికి ముందు ఎడారిగా ఉన్న మునుగోడు నియోజకవర్గం నేడు సస్యశ్యామలంగా మారిందని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తోకల వెంకన్న, అన్నెపర్తి శేఖర్, మంచుకొండ కీర్తి సంజయ్, తేలుకుంట్ల జానయ్య పాల్గొన్నారు.

ఘనంగా బోనాల వేడుకలు

మడివాల మాచి దేవుడి పంచమ వార్షికోత్సవం సందర్భంగా ఈదమ్మ, రేణుకా ఎల్లమ్మ బోనాలను చండూరు మండల కేంద్రంలో చాకలి కులస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి హాజరై బోనం ఎత్తుకున్నారు. కార్యక్రమంలో చాకలి కుల పెద్దలు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.


బోనం ఎత్తుకున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల

ఆరోగ్యమిత్రల సమస్యలను పరిష్కరించాలి

మర్రిగూడ : ఆరోగ్యమిత్రల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆరోగ్యమిత్రల ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమిత్రల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపకపోతే విధులను బహిష్కరించి సమ్మెబాట పడతామని హెచ్చరించారు. 16 సంవత్సరాలుగా ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తూ ఉద్యోగ భద్రత లేకుండా పనులు చేస్తున్నామని, హోదాకు తగ్గట్లు డాటా ఎంట్రీ ఆపరేటర్ క్యాడర్‌ను కల్పించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆత్మహత్యలు చేసుకున్న ఆరోగ్య మిత్రల కుటుంబాలకు ప్రభుత్వం, ఎలాంటి నష్టపరిహారం అందించకపోవడం బాధాకరమన్నారు. వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఆరోగ్యమిత్రలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కనీస వేతనంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఆయన వెంట భిక్షం, రాజు తదితరులు ఉన్నారు.

ఈదురు గాలులతో పండ్ల తోటలకు నష్టం


కేతేపల్లి : నేలవాలిన నిమ్మచెట్టును పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి విద్యాసాగర్

నకిరేకల్ : నకిరేకల్ మండలంలో శనివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షానికి పండ్ల తోటలకు భారీగా నష్టం వాటిల్లింది. నిమ్మ, మునగ తోటలకు నష్టం ఏర్పడింది. నకిరేకల్ మండలం చందుపట్ల రెవెన్యూ పరిధిలోని కొత్తోల్లగూడెం గ్రామంలో 80 ఎకరాల్లో నిమ్మ చెట్లు నేలవాలాయి.

కేతేపల్లి : మండలంలో శనివారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. ఈదురు గాలులతో కూడిన వర్షానికి నిమ్మ, మునగ తోటలకు తీవ్ర నష్టం జరిగింది. ఈదురు గాలులకు కొండకిందిగూడెం, చెర్కుపల్లి గ్రామాల్లో నష్టపోయిన నిమ్మ, మునగ తోటలను నకిరేకల్ నియోజకవర్గ ఉద్యాన అధికారి రావుల విద్యాసాగర్ ఆదివారం పరిశీలించారు. కొండకిందిగూడెం గ్రామంలో సుమారు 50 ఎకరాల్లో నిమ్మ తోట, చెర్కుపల్లిలో 3 ఎకరాల్లో మునగ తోట ధ్వంసమయిందని ఆయన తెలిపారు. పంట నష్టపోయిన రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంకు అకౌంట్, నష్టపోయిన పంట ఫొటోలను దరఖాస్తుకు జతచేసి వ్యవసాయ విస్తరణ అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

మహాసభలను జయప్రదం చేయండి

నకిరేకల్ : జూలై 4,5 తేదీల్లో ఇల్లందులో పీవైఎల్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి ఇందూరు సాగర్, రాష్ట్ర నాయకుడు అంబటి చిరంజీవి పిలుపునిచ్చారు. నకిరేకల్‌లోని యానాల మల్లారెడ్డి స్మారక భవనం న్యూడెమోక్రసీ కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు గడిచినా నేటికి నిరుద్యోగ సమస్య పరిష్కరించడంలో, ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలమైందన్నారు. జిల్లా అధ్యక్షుడు మామిడోజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి బీవి చారి, కోశాధికారి బొడ్డు సతీష్, అంబటి నర్సయ్య, వెంకన్న, నాగరాజు, సైదులు తదితరులు ఉన్నారు.

రైతుల శ్రమదానం


గుర్రపు డెక్కను తొలగిస్తున్న రైతులు

శాలిగౌరారం : శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరు వచ్చే ప్రధాన రాచకాల్వ వెంట మండలంలోని ఎన్‌జి కొత్తపల్లి గ్రామానికి చెందిన రైతులు ఆదివారం శ్రమదానం చేశారు. శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరువచ్చేందుకు రామన్నపేట మండలం పల్లివాడ వద్ద మూసీనదిపై హెడ్‌రెగ్యూలేటర్ నిర్మించారు. దీని నుంచి సుమారు 30 కిలోమీటర్లు రాచకాల్వ నిర్మించారు. ఈ రాచకాల్వకు రామన్నపేట, నార్కట్‌పల్లి, శాలిగౌరారం మండలాలకు చెందిన పలు చెరువులు, కుంటలు అనుసంధానమై ఉన్నాయి. ప్రస్తుతం మూసీనదిలో వరదనీరు ప్రవహిస్తుండడంతో శాలిగౌరారం ప్రాజెక్టులోకి హెడ్‌రెగ్యూలేటర్ ద్వారా వరదనీటిని మళ్లించారు. రామన్నపేట మండలం తుర్కపల్లి వద్ద రాచకాల్వలో గుర్రపుడెక్క పేరుకుపోయి వరదనీటికి అడ్డుగా నిలువడంతో రైతులు శ్రమదానం చేసి గుర్రపుడెక్కను పూర్తిగా తొలగించి రాచకాల్వలో వరదనీరు వచ్చేలా పాటుపడ్డారు.

13న మహిళా సంక్షేమ దినోత్సవం

చండూరు : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో ఈ నెల 13న మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగే మహిళా సంక్షేమ దినోత్సవానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుజాత, శిరీషా పిలుపునిచ్చారు. ఆదివారం వారు చండూరులో విలేకరులతో మాట్లాడారు. చండూరు, గట్టుప్పల మండలాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు.

ఆర్థికసాయం అందజేత


నగదు అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

చిట్యాల : మండలంలోని పిట్టంపల్లి గ్రామానికి చెందిన బిల్లపాటి శ్రీనివాస్‌రెడ్డి కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. అతడికి మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం ఆ గ్రామానికి చెందిన రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రూ.30 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బిల్లపాటి నర్సిరెడ్డి, ఉపాధ్యక్షుడు తుమ్మల వెంకట్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి బండారు లింగారెడ్డి, కోశాధికారి కొమురెల్లి సంతోష్‌రెడ్డి, తుమ్మల లక్ష్మారెడ్డి, దేవరపల్లి సత్తిరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మోహన్‌రెడ్డి, రాంరెడ్డి, గోపిరెడ్డి పాల్గొన్నారు.

సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం

నకిరేకల్ : దివ్యాంగులకు పెన్షన్ పెంచడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం చందుపట్ల గ్రామంలో సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యల ఫ్లెక్సీలకు తెలంగాణ మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సిలివేరు ప్రభాకర్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఎంపీటీసీ ఇమడపాక లక్ష్మి వెంకన్న, మాజీ సర్పంచ్ వెంకటేషం, తండు శ్రీను, వికలాంగుల హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు జిల్లా జానయ్య, సుదర్శన్, సైదులు, నర్సయ్య, భిక్షపతి, నరేందర్, లక్ష్మి, సరిత, గోపమ్మ, శ్రీను ఉన్నారు.


నల్లగొండ : సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణంలోని శ్రీ శారద విద్యా మందిర్ హైస్కూల్‌లో చదివిన 2007-08 సంవత్సరం ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం నల్లగొండలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అనంతరం కరస్పాండెంట్ సరళ, నాగేందర్, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, శోభారాణి, సురేఖ, సఫియా, అండాలు, యాదగిరి, సురేష్, సాయిలు, సైదులు, మురళీకృష్ణ, నాగరాజు, జానీలను ఘనంగా సన్మానించారు.


కొప్పోలులో నాటి ఉపాధ్యాయ బృందంతో ..

కేతేపల్లి : కొప్పోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2009-10 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదవిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డితోపాటు తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఈకార్యక్రమానికి ఆహ్వానించి శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

చిట్యాల : గ్రామాల్లో ఇళ్లు లేని అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు, ఇళ్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిన్నకాపర్తి గ్రామంలో పేదలకు గతంలో ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాలను ఆదివారం గ్రామస్తులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం నగేష్ మాట్లాడుతూ పేదలకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం భూమి కొనుగోలు చేసి ఏళ్లు గడుస్తున్నా నేటికీ పంపిణీ చేయకపోవడం తగదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హులకు వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కోనేటి రాములు, లోడే విష్ణుమూర్తి, రూపని ఇద్దయ్య, హన్మయ్య, గణేశ్, రామకృష్ణ, రూపని సైదులు పాల్గొన్నారు.

కంప చెట్లు కొట్టారు.. తొలగించడం మరిచారు

- పలివెల ఫీడర్ చానల్‌లో చెట్లను నరికి వదిలేసిన కూలీలు
- వరద నీటికి ఆటంకం ఏర్పడే అవకాశం
- పట్టించుకోని ఉపాధిహామీ సిబ్బంది

మునుగోడు : మండలంలోని పలివెల ఫీడర్ చానల్‌లో ఏపుగా పెరిగిన కంప చెట్లను అధికారులు ఉపాధిహామీ పథకంలో భాగంగా కూలీలతో కొట్టించారు. కానీ చెట్లను కాల్వలో అలాగే పడేశారు. చెట్లను తొలగించకపోవడంతో వరద నీరు పారడం ఇబ్బందిగా మారింది. ఆ ఫీడర్ చానల్ ద్వారా మునుగోడు పెద్ద చెరువుతోపాటు ఎల్లగూడెం, జక్కలవారిగూడెం, గూడపూర్ తదితర గ్రామాల చెరువులకు నీరు పారుతుంది.

ఉపాధిహామీ సిబ్బంది నిర్లక్ష్యం

పలివెల ఫీడర్ చానల్ దాదాపు 7 కిలో మీటర్ల


పలివెల ఫీడర్ చానల్‌లో కంప చెట్లు

దూరంలో ఉంటుంది. అందులో కంపచెట్లతోపాటు ఇతర మొక్కలు పెరిగాయి. వర్షాలు వచ్చి వరద నీరు పారే సమయంలో అవి అడ్డుగా మారి నీరు పారకుండా అడ్డుకుంటున్నాయి. దీంతో చెరువుల్లో నీరు నిండకపోగా కాల్వపై వత్తిడి పెరిగి అక్కడక్కడా కాల్వ తెగి నీరు వాగులో కలిసిపోతోంది. అంతేకాకుండా పలువురు రైతుల పంట చేల నుంచి నీరు పారి పంట నష్టం వాటిల్లుతోంది. దానిని గమనించిన అధికారులు కాల్వలో ఏపుగా పెరిగిన చెట్లను కూలీలతో రెండు నెలల క్రితం నరికివేయించడంతోపాటు కాల్వను చదును చేశారు. కానీ నేటికీ ఆ కాల్వలో నరికివేసిన చెట్లను తొలగించలేదు. ఈ విషయాన్ని సంబంధిత ఉపాధిహామీ సిబ్బందికి పలుమార్లు రైతులు విన్నవించినా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. వర్షాకాలం సమీపిస్తుండడంతో వర్షాలు కురిసి వరదలు వస్తే గతంలోలాగా కంప అడ్డుగా ఉండి నీరుపారే అవకాశం లేకుండా పోతుందని పలువురు రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని కాల్వలోని కంపను, ఇతర చెత్తను తొలగింపజేయాలని వేడుకుంటున్నారు.

కాల్వ నిండా కంప చెట్లు, తాటి మొద్దులే



మునుగోడు పెద్ద చెరువులోకి నీరు వచ్చే కాల్వ నిండా ఎప్పుడు చూసినా కంప చెట్లు, తాటి మొద్దులే కనిపిస్తాయి. దీంతో వర్షాలు వచ్చినప్పుడు వరద నీరు కాల్వలో పారకుండా కాల్వ కట్టపై నుంచి పారి రైతుల వ్యవసాయ పంటలు నీటమునిగిపోతున్నాయి. ఇటీవల ఉపాధిహామీ పథకంలో కంప చెట్లు తొలగించారు. కానీ వాటిని తొలగించకుండా అలానే వదిలేశారు.
–గుర్రం యాదయ్య, రావిగూడెం

త్వరలో తొలగింపజేయిస్తాం



కాల్వలో ఉన్న కంప చెట్లను కొట్టివేసి తొలగించలేదన విషయం నాకు ఇప్పటివరకు తెలియదు. ఉపాధిహామీ పథకం ద్వారా ఎంత దూరం పనిచేశారో అంత దూరం ఉన్న కంప చెట్లు, ఇతర చెత్తను త్వరలో కూలీలతో తొలగింపజేయిస్తాం. కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పనులు అసంపూర్తిగా చేశారు. ఇక నుంచి అలా జరగకుండా చూస్తాం.–శ్రీనయ్య, ఏపీఓ, మునుగోడు